# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-04-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో ఇంధన కొరత సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

2. **ప్రతి గ్రామంలో సురక్షిత తాగునీటిని అందించాలని అధికారులను ఆదేశించిన జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.**

3. **అంబేద్కర్ స్టడీ సెంటర్ లో అభ్యర్థులకు అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్న మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి.**

4. **రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం కానున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్” కార్యక్రమం.**

==========================

రాష్ట్రంలో ఇంధన కొరత అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. పలుచోట్ల పెట్రోల్ బంకుల మూసివేతపై పలు జిల్లాల్లో వాహనదారులు, రైతుల ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు. ఇంధన సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలని, పెట్రోల్ బంకుల యజమానులు, ఆయిల్ కంపెనీలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.

-------------------------

ప్రతి గ్రామంలో సురక్షిత తాగునీటిని అందించాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో నిన్న ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాలకొల్లు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి సురక్షిత తాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అమరజీవి జలధార, జల జీవన్ మిషన్ పనుల్లో జాప్యం లేకుండా సకాలంలో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

తిరుపతి చెన్నారెడ్డి కాలనీలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్ కేంద్రాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఈరోజు తనిఖీ చేశారు. అంబేద్కర్ స్టడీ సర్కిల్లో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మంత్రి మాట్లాడారు. హాస్టల్ లో అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంబేద్కర్ స్టడీ సర్కిల్ లో శిక్షణ పొందుతున్న వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని చెప్పారు. స్టడీ సెంటర్ లో అభ్యర్థులకు అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

వ్యవసాయానికి అనుబంధంగా పశుసంవర్ధక రంగం గ్రామీణ ప్రజల జీవనోపాధికి కీలకంగా నిలుస్తోందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ టి.దామోదర నాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో ప్రపంచ వెటర్నరీ దినోత్సవాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెటర్నరీ వైద్యులు కేవలం పశువుల ఆరోగ్య సంరక్షకులే కాకుండా ఆహార భద్రత, ప్రజారోగ్యానికి బలమైన ఆధార స్తంభాలని పేర్కొన్నారు. సమాజం ఆరోగ్యవంతంగా ఉండాలంటే వారి సేవలు అత్యంత అవసరమని తెలిపారు. అత్యవసర పరిస్థితులు, విపత్తుల సమయంలో పశువులను రక్షించడం, వ్యాధుల వ్యాప్తిని అడ్డుకోవడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడడంలో వెటర్నరీ వైద్యులు కీలకంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు.

---------------------------

సింగపూర్‌లో రాష్ట్ర మంత్రుల బృందం శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఐదో రోజు సింగపూర్ సంక్షోభ నిర్వహణ వ్యవస్థపై మంత్రులు అధ్యయనం చేశారు. సింగపూర్ యూనివర్శిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రజ్వానా విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ఏకతాటిపైకి వచ్చి ఎలా పనిచేస్తాయో వివరించారు. సంక్షోభ సమయంలో నాయకత్వం ఎలా ఉండాలి, నైతిక నిర్ణయాలకు ఎందుకు ప్రాధాన్యం ఇవ్వాలి, రాబోయే ప్రమాదాలను ముందుగానే అంచనా వేసి ఎలా సిద్ధంగా ఉండాలనే అంశాలపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, బి.సి. జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 133వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

రాష్ట్రంలో మలేరియా జ్వరాల నియంత్రణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇందులో భాగంగా బాపట్ల, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాలను మలేరియా రహిత జిల్లాలుగా ప్రకటించేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు ప్రపంచ మలేరియా

దినోత్సవాన్ని పురస్కరించుకుని విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. 2024-25 నుంచి మలేరియా జ్వరాల కేసులు రాష్ట్రంలో తగ్గుతూ వస్తున్నాయని తెలిపారు. 2024-25లో 7 వేల 8 వందల 71 కేసులు, 2025-26లో 7 వేల 199 కేసులు నమోదయ్యాయన్నారు. 2030 నాటికి మలేరియా కేసులు గణనీయంగా తగ్గించేందుకు చర్యలు చేడుతున్నామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

--------------------------

అనంతపురం జిల్లాలో మలేరియా నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మలేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ వారి పరిసరాలను శుభ్రంగా పెట్టుకుంటే మలేరియా లాంటి జ్వరాలు రావని మలేరియా నివారణ అధికారి ఓబులు తెలియజేస్తూ..

వాయిస్..25 సెకన్లు

--------------------------

ఎకనమిక్ టైమ్స్ సంస్థ ప్రకటించిన బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ 2025 అవార్డును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అందుకోనున్నారు. ముంబైలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి మధ్యాహ్నం ఉండవల్లిలోని క్యాంప్ ఆఫీసు నుంచి బయలుదేరి ముంబై విమానాశ్రయం చేరుకుంటారు. సాయంత్రం ముంబయిలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌కు వెళ్తారు. ఎకనమిక్ టైమ్స్ నిర్వహించే అవార్డుల కార్యక్రమంలో పాల్గొంటారు.

--------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ - ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ ఈరోజు జరగనుంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియంలో ఈ మధ్యాహ్నం మూడు గంటల 30 నిమిషాలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. మరో మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు పోటీ పడనున్నాయి. జైపూర్ లోని సవాయ్ మాన్‌సింగ్ క్రికెట్ స్టేడియంలో ఈ రాత్రి ఏడు గంటల 30 నిమిషాలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. నిన్న జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు విజయం సాధించింది. మరో వైపు గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈరోజు నుంచి 2 రోజులపాటు బీసీసీఐ ఆధ్వర్యంలో మంగళగిరి ఫ్యాన్ పార్క్ ను ఏర్పాటు చేసింది. క్రికెట్ అభిమానులు 4 మ్యాచ్ లు ఉచితంగా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు.

--------------------------

పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, గ్రాంట్-ఇన్-ఎయిడ్, ఎన్జీఓ, ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న అంధ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ ద్వారా ప్రభుత్వం ఉచితంగా బ్రెయిల్ పాఠ్య పుస్తకాలను అందజేయనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు బి. దేవరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అంధ విద్యార్థులు బ్రెయిల్ పాఠ్య పుస్తకాల కోసం ఆన్‌లైన్‌లో apdascac.ap.gov.in వెబ్‌సైట్‌లో సంబంధిత ధృవపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

====================